సాక్షి
విశాఖపట్నం
శనివారం । 28 । అక్టోబర్ । 2023



గవర్నర్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. 8లో



నేడు న్యూ భువనేశ్వర్ స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-న్యూ భువనేశ్వర్ మధ్య జనరల్ క్లాస్ కోచ్‌లతో శనివారం స్పెషల్ రైలు నడుపుతున్నారు. 8లో



భగవంత్ కేసరి ప్రేక్షకులను హత్తుకుంది 8లో

జిల్లా ఓటర్లు 19,15,682

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- డిసెంబర్ 9 తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ
- డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాల పరిష్కారం
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అత్యధికం
- జిల్లాలో 1941 పోలింగ్ స్టేషన్లు గుర్తింపు
- జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణకు సంబంధించి కీలక ప్రక్రియ మొదలైంది. దాదాపు 50 రోజుల పాటు మహా యజ్ఞంలా నిర్వహించిన ఇంటింటి సర్వే అనంతరం చేపట్టిన మార్పులు, చేర్పులు మదింపు చేసి ఎన్నికల కమిషన్ ఆమోదముద్ర వేసిన తర్వాత ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున శుక్రవారం విడుదల చేశారు. 43 రోజుల పాటు ముసాయిదాపై ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం మరోసారి మదింపు ప్రక్రియ నిర్వహించి తుది జాబితాను వచ్చే ఏడాది జనవరి 5న ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. జిల్లాలో గుర్తించిన మొత్తం ఓటర్లలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా ఉండటం గమనార్హం. సమగ్ర పరిశీలన అనంతరం మార్పులు చేర్పులు జరిగిన తర్వాత గురువారం సమగ్ర ముసాయిదా ఓటర్లు జాబితా ప్రచురించారు. వాస్తవానికి ఈ నెల 17నే డ్రాఫ్ట్ ప్రచురించాల్సి ఉంది. అయితే ఇంటింట ఓటరు సర్వేకు అదనపు సమయాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ కేటాయించడంతో డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ని 10 రోజుల అనంతరం విడుదల చేశారు. మొత్తం 7 నియోజకవర్గాల పరిధిలో 1,941 పోలింగ్ స్టేషన్లుండగా 19,15,682 మంది ఓటర్లున్నట్లు గుర్తించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్

ఇందులో పురుషులు 9,51,011 మంది ఉండగా పురుషుల కంటే అత్యధికంగా మహిళా ఓటర్లున్నారు. మహిళా ఓటర్లు 9,64,538 మంది ఉన్నట్లు గుర్తించారు. థర్డ్ జెండర్ ఓటర్లు 133 మంది ఉన్నట్లు ముసాయిదాలో పొందుపరిచారు.

అభ్యంతరాల స్వీకరణ

ఓటరుకు సంబంధించిన మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే అధికారులు సవరిస్తారు. డిసెంబర్ 9వ తేదీ వరకూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరిస్తారు. ఇందుకోసం జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక ప్రచార రోజులు నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తోంది. నవంబర్ 4,5 తేదీల్లోనూ, డిసెంబర్ 2,3 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు తీసుకునే బాధ్యతను బీఎల్‌వోలుకు అప్పగించనున్నారు. వాటి పర్యవేక్షణని ఈఆర్వోలు చేపడతారు.

జనవరి 5న ఓటర్ల తుది జాబితా..

డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించి పరిష్కరించనున్నారు. 2024 జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, తనిఖీ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం ఎన్నికల కమిషన్ జనవరి 5న తుది జాబితాను ప్రకటిస్తుంది. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుంది. తప్పులు లేని జాబితా తయారు చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేస్తున్నారు.

ఓటర్ల ముసాయిదా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 షెడ్యూల్

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ - 27 అక్టోబర్
క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ- 27 అక్టోబర్ నుంచి డిసెంబర్ 9 వరకూ
ప్రత్యేక ప్రచార క్యాంపులు- నవంబర్ 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో
క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం- డిసెంబర్ 26
తుది ఓటర్ల జాబితా ప్రచురణ- 2024 జనవరి 5

రాజకీయ పార్టీలతో సమావేశం..

ఓటరు జాబితా ముసాయిదా ప్రచురించిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ డా.మల్లికార్జున శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రచురించిన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతులను గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద, బూత్ లెవల్ అధికారి, తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఓటరు లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించు కోవాలని, వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఓటర్ల తుది జాబితా తదుపరి అభ్యంతరాలు లేకుండా రాజకీయపార్టీలు, ప్రజలు సహరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి జీవీ రవిరెడ్డితో పాటు టీడీపీ, బీజేపీ, బీఎస్పీ,ఆమ్‌ఆద్మీ, సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు..



డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటాం. ఇంకా ఎవరైనా ఓటర్లుంటే వారి కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం. మొత్తం 4 రోజుల పాటు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తాం. యువ ఓటర్లు ఫారం-6, భారతీయ పాస్‌పోర్టు కలిగిన విదేశాల్లోని భారతీయుల కోసం ఫారం-6ఏ, జాబితాలో పేర్లు తొలగించడం, చేర్చడంపై అభ్యంతరాలకు ఫారం-7, మార్పులు చేర్పుల కోసం ఫారం-8ని వినియోగించుకోవాలి. దరఖాస్తు విధానాన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో), సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) లేదా బీఎల్‌వోలకు దరఖాస్తు ఫారాలు ఇవ్వొచ్చు. ఆన్‌లైన్‌లో www.voters.eci.ov.in వెబ్‌సైట్‌లోగానీ, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్‌యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు.

– డా.మల్లికార్జున, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

అభ్యంతరాలు నిరభ్యంతరంగా చెప్పవచ్చు



ఓటరు నమోదులో ఏదైనా సమస్య తలెత్తితో ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. కలెక్టరేట్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఏ సమస్యలున్నా.. తమ ఫిర్యాదుల్ని మీ దగ్గర్లో ఉన్న ఓటర్ల నమోదు అధికారి/ సహాయాధికారులుగా వ్యవహరిస్తున్న తహసీల్దార్, జోనల్ కమిషనర్లు లేదా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలోనైనా నిరభ్యంతరంగా చెప్పవచ్చు. గతంలో ఒక కుటుంబంలో భార్య, భర్తలకు వేర్వేరు పోలింగ్‌బూత్‌లలో ఓటు ఉందనే ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. దీనికి సంబంధించి కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూరల్ పరిధిలో ప్రతి బూత్ లో 1500, అర్బన్ పరిధిలో 1200 మంది ఓట్లకు మించి ఉండకుండా చూడాలి. ఈ విభజన క్రమంలో కుటుంబ సభ్యుల ఓట్లు తారుమారవుతాయి. ఆ సమయంలో వారు దరఖాస్తు చేసుకుంటే ఏ బూత్‌లో ఉండాలని కోరుకుంటే ఆ బూత్‌కు అడ్జెస్ట్ చేస్తాం.

– కె.మోహన్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి

ఏఎంసీలో శతాబ్ది సందడి



మాట్లాడుతున్న మంత్రి విడదల రజని



ఏఎంసీ పైలాన్ వద్ద సెల్ఫీల సందడి

- ఘనంగా వందేళ్ల సంబరం
- తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాలలో శుక్రవారం సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులు, వైద్యులు, దేశ విదేశాల్లో స్థిరపడ్డ అనేక మంది ఆంధ్ర వైద్య కళాశాలకు తరలివచ్చారు. పూర్వ వైద్య విద్యార్థుల రాకతో ఒక్కసారిగా ఏఎంసీ ప్రాంగణం కళకళలాడింది. ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొడానికి వచ్చే వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. శుక్రవారం ఒక్కరోజే దాదాపు మూడు వేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.ఆంధ్రా మెడికల్ కాలేజీ ఆవరణలోను, బీచ్ రోడ్డులో ఉన్న ఏయూ కాన్వొకేషన్ హాలులో కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ఏర్పాట్లు చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, పీజీ చదివి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ వైద్యులు, వైద్య విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.

అంతకుముందు సెంటినరీ సెలబ్రేషన్స్ సావనీర్‌ను మంత్రి విడదల రజిని విడుదల చేశారు.కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, డీఎంఈ డీఎస్వీఎల్ నరసింహం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఇ.రమేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, సెకండరీ ఎడ్యుకేషన్ సంచాలకులు ఎస్. వేంకటేశ్వర్, ఎమెల్సీ డాక్టర్ రవీంద్ర బాబు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, నార్త్ అమెరికా ప్రెసిడెంట్ మైనేని నాగేంద్ర, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి. బుచ్చిరాజు,సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టి. రవిరాజు, అంకోసా ప్రెసిడెంట్ కె. శశిప్రభ, ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంధ్రా మెడికల్ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్ఫీలు దిగిన పూర్వ విద్యార్థులు

ఆంధ్రా మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థులు సెల్ఫీలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులంతా కలిసి సెంటినరీ బ్లాక్, పైలాన్, ఇతర నిర్మాణాల వద్ద సెల్ఫీలు దిగారు.



శతాబ్ది ఉత్సవాలకు హాజరైన ఏఎంసీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు

ఏఎంసీ తల్లిలాంటిది



ఆంధ్రా మెడికల్ కళాశాల తల్లిలాంటిది. 1986లో ఎంబీబీఎస్ ఇక్కడే చదువుకున్నా. చదువు పూర్తయిన తర్వాత అమెరికాలో ఉద్యోగం రావడంతో అక్కడే స్థిరపడ్డా. చదువుకున్న సంస్థకు ఏదో విధంగా సాయం చేయాలని పూర్వ విద్యార్థులంతా నిర్ణయించుకున్నాం. 1981 నుంచి నేటి వరకు కేజీహెచ్, ఏఎంసీలకు సుమారు రూ.50 కోట్లు సాయం అందించాం. కరోనా సమయంలో కేజీహెచ్‌కు అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ పరికరాలు ఇచ్చాం. వైద్యపరంగా ఎలాంటి సాయాన్ని అయినా అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

– మైనేని నాగేంద్ర, అధ్యక్షుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్- నార్త్ అమెరికా

రుణం తీర్చుకుంటాం



వందేళ్లు పూర్తి చేసుకున్న ఏఎంసీలో వైద్య విద్యను అభ్యశించడం ఎంతో గర్వంగా ఉంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థిగా ఇప్పుడు శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. కళాశాల రుణం తీర్చుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నా. క్యాన్సర్ పరీక్షలకు అవసరమైన పరికరాల కోసం నిధులు ఇచ్చాం. ఇప్పుడు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి పూర్తి సహకారం అందిస్తున్నాం.

– చలసాని ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు, అంకోసా సంస్థ

న్యూస్‌రీల్

వీఎంఆర్‌డీఏ కార్యదర్శిగా కీర్తి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కీర్తి

దొండపర్తి: వీఎంఆర్‌డీఏ నూతన కార్యదర్శిగా దాట్ల కీర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సెక్రటరీగా విధులు నిర్వర్తించిన రంగయ్యను శ్రీకాకుళం ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అతని స్థానంలో కీర్తిని నియమించడంతో ఆమె సెక్రటరీగా చార్జ్ తీసుకున్నారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: చంద్రగ్రహణం కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు శనివారం మధ్యాహ్నం 2.30గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈసందర్భంగా రాత్రి ఆరాధన టికెట్లు రద్దు చేశామన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దర్శనాలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అలాగే ఆదివారం ఉదయం జరిగే సుప్రభాతసేవ, ఆరాధన టికెట్లను రద్దు చేశామన్నారు. అలాగే స్వర్ణపుష్పార్చన, గరుడసేవలను రద్దుచేసినట్టు చెప్పారు.

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా సురేష్



డాబాగార్డెన్స్: జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా బి.సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలల కిందట డైరెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన సురేష్‌ను ప్రభుత్వం జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా నియమించింది. సీసీపీగా ఉన్న సునీతను డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. సురేష్ గతంలో జీవీఎంసీ సీసీపీగా, వీఎంఆర్‌డీఏ సీయూపీగా, జీవీఎంసీలో డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను సిటీ ప్లానర్ లక్ష్మీదొర, డీసీపీలు నరేంద్రనాథ్‌రెడ్డి, పద్మజ, ఏసీపీలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు అభినందనలు తెలిపారు.

భారత్-ఆస్ట్రేలియా టీ20కి పక్కా ఏర్పాట్లు

విశాఖ స్పోర్ట్స్ : భారత్-ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో భాగంగా వచ్చేనెల 23న ఆడే తొలి మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనున్న వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 27 వేల మంది కూర్చునే వీలున్న ఈ స్టేడియంలో కొన్ని బ్లాక్స్‌లో కుర్చీలను మార్చనున్నామన్నారు. ఆటగాళ్ల డ్రెస్సింగ్ రూమ్, తదితర వాటిని మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో టిక్కెట్ల విక్రయాన్ని పారదర్శకంగా చేపడతామన్నారు. త్వరలో మ్యాచ్ నిర్వాహక కమిటీ సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష చేయనున్నామన్నారు.

ఇంగ్లాండ్‌తో భారత్ టెస్ట్ మ్యాచ్

ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు ఇదే వేదికలో ఇంగ్లాండ్-భారత్ మరోసారి అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నామని గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. లెజెండ్స్ క్రికెట్ టోర్నీ తొలి దశ పోటీలకు వైఎస్సార్ స్టేడియం వేదిక కానుందన్నారు. ఈ టోర్నీ ఐదు వేదికల్లో ఆరు జట్లు తలపడనుండగా.. డిసెంబర్ 2 నుంచి మూడు రోజుల పాటు మూడు మ్యాచ్‌లు ఇక్కడే జరగనున్నాయని చెప్పారు. దేశవాళీ క్రికెట్‌లో భాగంగా బీసీసీఐ రాష్ట్రంలో పలు మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతినిచ్చిందన్నారు. ఈ మ్యాచ్‌లు విజయనగరం, కడప, విజయవాడ, అనంతపురం వేదికలుగా జరగనున్నాయన్నారు. ఆంధ్ర జట్టు దులీప్ ట్రోఫీ, దియోధర్ ట్రోఫీ, ఇరాని ట్రోఫీ, వుమెన్ ప్రీమియర్ లీగ్‌ల్లో తలపడుతుందన్నారు. ఈ సమావేశంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కోశాధికారి చలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి

నేడు భీమిలిలో సాధికార బస్సు యాత్ర

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో జరుగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని జిల్లాలో ప్రజలకు, పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎండాడలో లా కాలేజీ సమీపంలో పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కార్యాలయంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, మేరుగ నాగార్జున మీడియా సమావేశంలో మాట్లాడతారన్నారు. అనంతరం వారంతా మధురవాడ చంద్రపాలెం హైస్కూల్‌లో నాడు-నేడు పనులు పరిశీలిస్తారు. అక్కడ నుంచి 12.45 గంటలకు బోయిపాలెం నుంచి ర్యాలీగా బయలుదేరి తగరపువలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ నేతలంతా హాజరుకావాలని కోలా గురువులు పిలుపునిచ్చారు.

ఉప రాష్ట్రపతి విశాఖ రాక నేడు



మహారాణిపేట: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ శనివారం తొలిసారి విశాఖ రానున్నారు. ఆయన సతీమణి సుదేష్ ధన్‌కర్‌తో కలిసి ఢిల్లీ నుంచి విమానంలో ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. వారికి గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి బయలుదేరి నేరుగా ఆంధ్ర మెడికల్ కాలేజీకి చేరుకుంటారు. అనంతరం బీచ్ రోడ్డులోని ఏయూ కాన్వొకేషన్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు జరిగే ఆంధ్రా మెడికల్ కాలేజీ సెంటినరీ ఉత్సవాల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి ఐఎన్ఎస్ డేగాకు బయలుదేరుతారు. అక్కడ కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలుదేరుతారు. ఉప రాష్ట్రపతికి వీడ్కోలు అనంతరం 4.35 గంటలకు గవర్నర్ గన్నవరం బయలుదేరుతారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ చేతుల మీదుగా శనివారం పలు అభివృద్ధి పనులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ శ్రీకారం చుట్టనుంది. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సెంటినరీ పైలాన్‌ను ప్రారంభించనున్నారు. అమెరికాలో స్థిరపడిన వైద్యులు, వైద్య విద్యార్థులు అందించిన రూ.20 కోట్ల నిధులతో క్లినికల్ అండ్ బయో మెడికల్ రీసెర్చ్ సెంటర్ పనులకు శంకుస్థాపన చేస్తారు. మొత్తం రూ.100 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. తొలి విడతగా రూ.20 కోట్లు అందిస్తున్నట్టు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయండి

అల్లిపురం: ప్రత్యేక శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న ప్రజలకు అవసరమైతే మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జె.నివాస్ వైద్యులను ఆదేశించారు. కొబ్బరితోట యూపీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలసి సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా పట్టణ ప్రాంతాల్లో 10,808 మందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కొబ్బరితోట-1 సచివాలయం పరిధిలో 520 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో ఆరుగురిని మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జోనల్ కమిషనర్ పి.శివప్రసాద్, 33, 34, 35, 41 వార్డుల క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వార్డు నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, తాత బ్బాయి, ఆరోగ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర కుటుంబ ఆరోగ్య శాఖ కార్యదర్శి జె నివాస్

కనురెప్పే కాటేస్తే..

- కన్న కూతురిపై మూడేళ్లుగా లైంగికదాడి
- భార్య, కుమార్తెలపై నిత్యం దాడి
- స్థానికుల సమాచారంతో వెలుగులోకి..
- పోలీసులకు ఫిర్యాదు

కంటి పాపకు రక్షణగా నిలవాల్సిన కను రెప్పే కాటేస్తే ఆ వేదన వర్ణనాతీతం. యుక్తవయసుకు వచ్చిన అమ్మాయికి అండగా నిలవాల్సిన తండ్రే పశువులా ప్రవర్తించి, కామవాంఛ తీర్చుకుంటే మూడేళ్లుగా మౌనంగా భరించాల్సి రావడం ఎంత దయనీయం. మల్కాపురం పరిధిలో జరిగిన ఈ ఘటన కన్నప్రేమకు.. మానవత్వానికే ప్రశ్నార్థకంగా నిలిచింది.

మల్కాపురం : ఇటువంటి కష్టం ఏ కుటుంబానికి రాకూడదు..ఇలాంటి సంఘటన ఎవరికీ ఎదురుపడకూడదు..కన్నకూతుర్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే లైంగిక దాడికి పాల్పడుతుంటే ఎవరికీ చెప్పుకోలేని వేదన..తల్లికి తెలిసి కూడా ఎదిరించలేని వైనం..మూడేళ్లుగా కంటిపాపను కాటేస్తున్న ఆ మృగాడు వికృత చేష్టలు బయటపడ్డాయి. మౌనంగా ఉన్న ఆ యువతి, తల్లి పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపాన ఇండ్రస్ట్రియల్ కాలనీ వద్ద హనుమంత్ శివ అనే వ్యక్తి భార్య కుమార్తె, కుమారుడితో కలిసి కొంతకాలంగా నివాసముంటున్నాడు. డిగ్రీ చదువుతున్న కుమార్తెను గాజువాకలోని ఓ కోచింగ్ సెంటర్లో పరీక్షకు తీసుకువెళుతున్నట్టు ఇంట్లో చెప్పాడు. గురువారం ఉదయం బైక్‌పై కుమార్తెను ఎక్కించుకుని కోచింగ్ సెంటర్‌కు కాకుండా ఓ లాడ్జికి తీసుకువెళ్లాడు. అక్కడ లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఘటన అనంతరం ఇంటికి వచ్చిన బాలిక తల్లికి చెప్పుకుని రోదిస్తుండగా చుట్టుపక్కలవారు విని స్పందించారు. మూడేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడని యువతి ఆవేదన వ్యక్తం చేసింది. గట్టిగా ప్రశ్నిస్తే తనపై,తల్లిపై దాడి చేసేవాడని కన్నీటి పర్యంతమయ్యారు. నోరు మెదిపితే ఇంట్లో నుంచి బయటకు పంపించేస్తానని, మీరు దిక్కులేని వారవుతారని భయపెట్టేవాడని తెలిపారు. గురువారం సాయంత్రం స్థానికుల సాయంతో యువతి, ఆమె తల్లి కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి వికృతచేష్టలను చెప్పుకుని యువతి రోదించింది. ఫిర్యాదు అందుకున్న సీఐ జి.డి.బాబు విచారణ ప్రారంభించారు. బాధిత యువతిని వైద్యపరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.శివను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



స్థాయీ సంఘంలో అన్నీ ఆమోదం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంటకకుమారి అధ్యక్షతన నిర్వహించారు. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘం అజెండాలో 52 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండా అంశాలు పొందుపరచగా, మొత్తంగా 56 అంశాలను సభ్యులు ఆమోదించారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.11 కోట్ల 16 లక్షల అభివృద్ధి పనులు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికుల ఏర్పాటుకు రూ.44.06 లక్షలు, క్రీడా విభాగానికి సంబంధించి రూ.44.60 లక్షలు, రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల ప్రొబేషన్, సర్వీస్ స్పెషల్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలతో పాటు ఇతర అంశాలను సభ్యులు ఆమోదించారన్నారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు అదనపు కమిషనర్ వై శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఏఎంవోహెచ్ సీహెచ్ సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

గవర్నర్‌కు ఘన స్వాగతం

గోపాలపట్నం: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో ఆయన నగరానికి బయలుదేరారు. శనివారం జరిగే ఏఎంసీ శతాబ్ది వేడుకల్లో ఆయన పాల్గొనున్నారు.


విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లికార్జున

భగవంత్ కేసరి ప్రేక్షకులను హత్తుకుంది

దర్శకుడు అనిల్ రావిపూడి

జగదాంబ: హీరో బాలకృష్ణ కెరీర్‌లోనే భగవంత్ కేసరి సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుందని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. మెలోడీ థియేటర్‌లో శుక్రవారం చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా థియేటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమాను పెద్ద హిట్ చేసిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. తాను రెగ్యులర్‌గా తీసే జోనర్ దాటి బాలయ్యతో తీసిన సినిమా పెద్ద హిట్ కావడం ఆనందంగా ఉందన్నారు. సినిమాలో మేము చెప్పిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్ సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా హత్తుకున్నాయన్నారు. పోలీసులు, ఉపాధ్యాయులు ఈ సన్నివేశాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. ఈ కథ ఆడపిల్లల తల్లిదండ్రులకు బాగా కనెక్ట్ అయిందని, బాలకృష్ణ తన పాత్రలో జీవించారని కొనియాడారు. తనకు విశాఖతో ఎంతో అనుబంధం ఉందని, తన సినిమా కథలన్నీ విశాఖలోనే రాసుకున్నానని చెప్పారు. హీరోయిన్ శ్రీ లీల మాట్లాడుతూ ఇటువంటి సినిమా చేసినందుకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఇది కంటెంట్ ఓరియంట్ సినిమా అని, కుటుంబ సమేతంగా చూడాలని కోరారు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ తన నమ్మకాన్ని ఈ సినిమా నిలబెట్టిందన్నారు. నటుడు జీవన్ మాట్లాడుతూ ఈ సినిమాలో పోలీసు అధికారి పాత్ర తనకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. నటుడు సత్యసాయి శ్రీనివాస్ మాట్లాడుతూ హీరోయిన్ శ్రీలీల పాత్ర మహిళలకు స్ఫూర్తిదాయకం అన్నారు. నటుడు మురళీ, చిత్ర నిర్మాత హరీష్ పెద్ది, శ్రీవెంకటేశ్వర ఫిలింస్ ప్రతినిధి శ్రీనివాస్, మెలోడీ థియేటర్ ప్రతినిధులు గౌరీశంకర్, రమణ, బాలకృష్ణ అభిమాన సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం సినిమా యూనిట్ ఉదయం ఆటకు వచ్చిన ప్రేక్షకులతో ముచ్చటించింది.


మాట్లాడుతున్న దర్శకుడు అనిల్, హీరోయిన్ శ్రీలీల

నిండు జీవితాన్ని ఈడ్చుకుపోయింది

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


నవీన్(ఫైల్)

పీఎంపాలెం: జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మరణించగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. బొబ్బిలి మండలం అలజంగికి చెందిన కిలారి నవీన్(21) అవివాహితుడు. స్థానికంగా ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మారికవలసలోని రాజీవ్ గృహ కల్పలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన కల్యాణ చక్రవర్తి పీఎంపాలెంలోని ఓ ఆలయంలో అర్చకుడు. వీరిద్దరిదీ ఒకే ఊరు కావడంతో తరచూ కలుస్తుంటారు. అలా గురువారం రాత్రి 8 గంటల సమయంలో కలిసి పీఎంపాలెం రెండో బస్టాప్ వద్ద టిఫిన్ చేశారు. తర్వాత ఎండాడ బంకులో పెట్రోల్ వేయించడానికి చక్రవర్తి వారి అన్నయ్య బైక్(బులెట్)పై బయలుదేరారు. అక్కడ పని ముగించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. దిశ పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనం నిలిపి.. మూత్ర విసర్జనకు వెళ్లారు. తిరిగి బయలుదేరారు. నవీన్ బైక్ నడుపుతుండగా, చక్రవర్తి వెనుక కూర్చున్నాడు. ఈ క్రమంలో ముందు వెళుతున్న వాహనం అకస్మాత్తుగా ఆగడంతో నవీన్ తొట్రుపాటుకు గురయ్యాడు. బైక్ హ్యాండిల్ లారీకి తగలడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. వెనుకనే వస్తున్న మరో లారీ నవీన్‌ను సుమారు 100 మీటర్ల దూరం ఈడ్చుకుపోవడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మరణించాడు. చక్రవర్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. నవీన్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం పూర్తి చేశారు. చక్రవర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ఆలయంలోకి శునకం' ఘటనపై ఈవో ఆగ్రహం

సిబ్బందికి మెమోలు, సెక్యూరిటీ ఏజెన్సీకి నోటీసులు జారీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలోకి శునకం రావడంపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు గల కారణాలపై ఆరా తీశారు. శునకం ప్రవేశించిన ఉత్తర రాజగోపురం నుంచి ఆలయంలోకి వెళ్లే మార్గాన్ని శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. శానిటరీ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులను పిలిచించి మాట్లాడారు. విధుల్లో ఉండగా ఆలయంలోకి శునకం ఎలా వచ్చిందని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయానికి సమీపంలోని గిరిజన గ్రామంలో పదుల సంఖ్యలో కుక్కలు ఉన్నట్లు గుర్తించి.. ఆ గ్రామానికి చెందిన సురేష్‌తో మాట్లాడారు. భక్తులపై కుక్కలు దాడి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జీవీఎంసీ సహాయంతో కొండపై కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. క్యూల్లోకి శునకాలు ప్రవేశించకుండా ఉత్తర రాజగోపురం, దక్షిణ రాజగోపురం, ప్రసాద విక్రయశాల వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆలయ ఏఈవో, పర్యవేక్షకుల దగ్గర నుంచి సెక్యూరిటీ గార్డుల వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రైవేట్ సెక్యూరిటీ మేనేజింగ్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేశామన్నారు. దేవస్థానంలో పనిచేస్తున్న కొందరు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే.. ఆ ఏజెన్సీనే రద్దు చేస్తామని హెచ్చరించారు. కాగా.. ఈవో ఆదేశాలతో దక్షిణ రాజగోపురానికి ఇరువైపులా అధికారులు ఐరన్ మెస్‌ను ఏర్పాటు చేశారు.


ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

నేడు 23 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శుక్రవారం 24 ప్రాంతాల్లో నిర్వహించారు. అర్బన్ పరిధిలో 23, రూరల్‌లో ఒక ప్రాంతంలో నిర్వహించిన శిబిరాల్లో 10,808 మందికి సేవలు అందించామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించగా.. అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. శనివారం అర్బన్ పరిధిలో 23 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

'ఖతార్' మరణశిక్షపై ప్రధాని జోక్యం చేసుకోవాలి

బాధితుడి బావమరిది విజ్ఞప్తి

డాబాగార్డెన్స్: జీవనోపాధి కోసం దోహా వెళ్లిన సుగుణాకర్‌ను గూఢాచర్యం కేసులో ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించడం అన్యాయమని, ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని అతని బావమరిది కపూర్ కల్యాణ్ చక్రవర్తి కోరారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుగుణాకర్ ఇండియన్ నేవీలో 2013 వరకు పనిచేసి పదవీ విరమణ పొందారని తెలిపారు. అనంతరం జీవనోపాధి కోసం 2018లో దోహా వెళ్లారని చెప్పారు. అయితే గూఢాచర్యం కేసులో సుగుణాకర్‌ను ఇరికించి ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. దహరా గ్లోబల్ టెక్నాలజీ అనే సంస్థలో పనిచేస్తున్న సుగుణాకర్‌తో పాటు మరో ఏడుగురు మాజీ భారత నావికాదళ అధికారులలను గతేడాది 29వ తేదీ అర్ధరాత్రి వారి ఇళ్ల నుంచి ఎత్తుకెళ్లి అరెస్టు చేశారని వెల్లడించారు. ఈ నెల 26న వారికి ఖతార్ కోర్టు మరణశిక్ష విధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఖతార్ ప్రభుత్వంతో చర్చలు జరిపి వారిని భారత్‌కు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు బెంగళూరు-న్యూ భువనేశ్వర్ స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-న్యూ భువనేశ్వర్ మధ్య జనరల్ క్లాస్ కోచ్‌లతో స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఎస్ఎంవీటీ బెంగళూరు-న్యూ భువనేశ్వర్ (06287) స్పెషల్ బెంగళూరులో శనివారం తెల్లవారు 3.30 గంటలకు బయలుదేరి.. రాత్రి 10.38 గంటలకు దువ్వాడకు చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 10.40 గంటలకు బయలుదేరి 29వ తేదీ ఆదివారం ఉదయం 6.30 గంటలకు న్యూ భువనేశ్వర్ వెళ్తుంది. న్యూ భువనేశ్వర్-బెంగళూరు(06288) స్పెషల్ ఈ నెల 29వ తేదీ ఉదయం 8.15 గంటలకు న్యూ భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. వాల్తేర్ డివిజన్ పరిధిలో దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఛత్రపూర్ స్టేషన్లలో ఆగుతుంది.

మామకు అల్లుడు ఝలక్

- ఇంటి నుంచి గెంటేసిన వైనం
- న్యాయం చేయాలని నిరాహార దీక్షకు దిగిన వృద్ధుడు


నిరాహార దీక్ష చేస్తున్న నాగరాజు

ఆరిలోవ: పిల్లల భవిష్యత్ కోసం తన సంతోషాలను పక్కన పెట్టి కష్టపడ్డారు. వారిని పెంచి పోషించి ఓ ఇంటి వారిని చేశారు. రిటైర్‌మెంట్ తర్వాత శేష జీవితం హాయిగా గడుపుదామని భూమి కొనుగోలు చేసి ఇల్లు కట్టారు. అది అల్లుడు చేతిలో పెట్టారు. తీరా ఆ అల్లుడు మామను ఆ ఇంటి నుంచి గెంటేశాడు. రోడ్డును పడ్డ ఆయన చేసేది లేక ఆ ఇంటి ముందే నిరాహార దీక్షకు దిగారు. ఆరిలోవలో జరిగిన ఈ సంఘటన స్థానికులను కలచివేసింది. 75 ఏళ్ల వయసు ఉన్న పోలవరం నాగరాజు తనకు జరిగిన అన్యాయం గురించి మీడియాకు వెల్లడించారు. నాగరాజు తెలంగాణలోని సింగరేణిలో ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కొన్నాళ్ల కిందట భార్య మరణించింది. ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత 2006లో ఆరిలోవ ప్రాంతం సుందరయ్యనగర్‌లో 133 చదరపు గజాల స్థలం కొనుగోలు చేశారు. రెండు అంతస్తుల ఇల్లు నిర్మించారు. నిర్మాణం చేపట్టక ముందు ఆ స్థలాన్ని అల్లుడు(బావమరిది) అయిన రంగాల పైడిరాజు పేరున రాశారు. దానిపై పైడిరాజు బ్యాంక్ రుణం తీసుకున్నాడు. నిర్మాణం సమయంలో పైడిరాజుకు నాగరాజు రూ.8లక్షలు ఇచ్చారు. దీని ప్రకారం ఆ ఇంటిపై ఇరువురికీ సమాన హక్కులు ఉన్నట్లు భావించారు. ఆ ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో నాగరాజు ఒక్కడే ఉంటున్నారు. మొదటి అంతస్తు, రెండో అంతస్తులను అల్లుడు అద్దెకు ఇచ్చాడు. కొన్నాళ్ల కిందట ఆ ఇంటిపై నీకెలాంటి హక్కు లేదని అల్లుడు పైడిరాజు, కూతురు కలసి నాగరాజుకు తేల్చిచెప్పారు. దీంతో పెద్దాయన కంగుతిన్నాడు. స్థలం కొనుగోలు చేసి, రూ.8 లక్షలు ఇచ్చానని.. ఇప్పుడు నాకు హక్కు లేదంటారేమిటని నిలదీశారు. ఈ విషయమై ఆరిలోవ పోలీసులు, సీపీకి ఫిర్యాదు చేశారు. స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గ్రామ సంఘంలో పెద్దల వద్ద పంచాయతీ పెట్టారు. అయినా ఆయనకు న్యాయం జరగలేదు. దీంతో చేసేది లేక శుక్రవారం ఉదయం ఆ ఇంటి ముందే నిరాహార దీక్షకు దిగాడు. ఆయన దీక్ష చేపట్టిన చోట గోడపై 'నాలాగా ఎవరూ మోసపోవద్దు.. ధర్మం, న్యాయం నాకు కావాలి' అంటూ రాయించారు. వృద్ధాప్యంలో ఉన్న తనను కన్న కూతురు, అల్లుడు ఒంటరిని చేసి అన్యాయం చేశారంటూ బోరున విలపిస్తున్నారు. ఆయన న్యాయ పోరాటానికి స్థానికులు సంఘీభావం తెలిపారు. రెండో కుమారుడు కొంత కాలం అన్ని సౌకర్యాలు కల్పించాడని.. కొద్ది రోజుల కిందట ఆయన కూడా వదిలేశాడని నాగరాజు తెలిపారు. మిగిలిన ఇద్దరు కుమారులు పట్టించుకోవడం లేదంటూ కన్నీరు పెట్టుకున్నారు.

గీతంలో 5జీ ల్యాబ్

కొమ్మాది: భారత ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ విభాగం గీతంలో ఏర్పాటు చేసిన 5జీ యూజ్ కేస్ ల్యాబ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. 5జీ టెక్నాలజీపై ఉన్నత విద్యా సంస్థల్లో లోతైన అధ్యయనాలు చేయడానికి వీలుగా దీనిని ఏర్పాటు చేశారు.